ఛేదనలో డాగీస్క్వాడ్

నేరస్థుల గుర్తింపులో కీలకంగా జాగిలాలు

దొంగతనాలు.. హత్యలు.. బాంబులు, నార్కొటిక్ లాంటి నేరాల దర్యాప్తులో జాగిలాలు కీలకంగా నిలుస్తున్నాయి. ఇటీవల నిందితుల అరెస్టులో ముఖ్యపాత్ర పోషించాయి. జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న జాగిలాలపై ప్రత్యేక కథనం..

బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నార్కొటిక్ కేసులకు జాకి

కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం మాదక ద్రవ్యాలు, గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో గంజాయి సరఫరా జోరుగా సాగుతుండగా గుర్తించటం ఇబ్బందిగా మారింది. నిందితులను పట్టుకునేందుకు ఈ మధ్యనే 'జాకి' అనే జాగిలాన్ని జిల్లాకు పంపారు. జాకికి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వగా గంజాయి ఉన్న చోటును గుర్తించి పట్టుకుంటుంది. మాదక ద్రవ్యాలు వినియోగించినా పసిగడుతుంది. జిల్లా ఎస్పీ ఇటీవల జగిత్యాల కొత్త బస్టాండ్ ప్రాంతంలో సోదాలు చేయించారు. జిల్లాలో ఇప్పటి వరకు మాదక ద్రవ్యాల కేసులు వెలుగు చూడకపోగా భవిష్యత్‌లో ఈ జాగిలం ఎంతో ఉపయోగపడుతుందని పోలీసులు వెల్లడించారు. గంజాయి గుర్తింపు కోసం దీనిని ఉపయోగిస్తామని పేర్కొన్నారు.

న్యూస్‌టుడే, జగిత్యాల, జగిత్యాల గ్రామీణం

జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో కేసుల దర్యాప్తు కోసం 5 జాగిలాలు ఉన్నాయి. దొంగతనాలు, హత్య కేసుల్లో ట్రాకర్ కోసం రెండు డాన్, రాంబో అనే జాగిలాలను వాడతారు. నెలలో కనీసం 10 కేసులకు వీటి అవసరమున్నట్లు పోలీసులు వివరించారు. ఆరో, సాండి అనే జాగిలాలు బందోబస్తులో భాగంగా బాంబులు ఉంటే గుర్తిస్తాయి. ఇప్పటి వరకు జిల్లాలో బాంబు అనవాళ్లు లేకపోయినా బాగా పనిచేస్తున్నాయని పోలీసులు తెలిపారు. ముఖ్య అధికారులు, మంత్రులు, రాజకీయ నాయకుల బందోబస్తులో వీటిని ఉపయోగిస్తున్నారు. హైదరాబాద్‌లోని మోహినాబాద్‌లోని పోలీసుశిక్షణ కేంద్రంలో రెండు నుంచి మూడు నెలల వయసు ఉన్న శునకాలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి జిల్లా కేంద్రాలకు పంపుతారు. సంరక్షణ కోసం ప్రత్యేకంగా పోలీసులను ఏర్పాటు చేస్తారు.

దర్యాప్తులో కీలకం

కేసుల్లో సాంకేతికత ఎంతో ఉపయోగపడి నిందితులకు శిక్షలు ఎక్కువగా పడుతున్నాయి. దీనికి తోడు జాగిలాలు కూడా దర్యాప్తులో ఎంతో కీలకంగా పని చేస్తున్నాయి. తాజాగా నార్కొటిక్ కోసం జాకి వచ్చింది. జాకికి ప్రత్యేక శిక్షణ ఇవ్వటంతో గంజాయి, మత్తు పదార్థాల సరఫరా చేసే వారిని ఇట్టే పసిగడుతుంది.

– అశోక్ కుమార్, ఎస్పీ, జగిత్యాల

నిందితుల అరెస్టులో రాంబో

జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న జాగిలాల్లో 'రాంబో' ప్రత్యేకత చాటుకుంటోంది. 2023లో కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుల అరెస్టులో కీలకంగా నిలిచింది. అంతర్రాష్ట్ర ముఠా దొంగలు మూడు రోజులు ఆలయ పరిసరాల్లో ఉండి రెక్కీ నిర్వహించి 2023 ఫిబ్రవరి 24న రాత్రి గుడిలో చొరబడి భారీ ఎత్తున ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అనవాళ్లు ఏమాత్రం దొరకకుండా నిందితులు సొత్తును దోసుకెళుతూ అటవీ ప్రాంతంలో రెండున్నర కి.మీ దూరంలో మద్యం తాగి సీసాలు పడేసి వెళ్లారు. వాసన పసిగట్టిన 'రాంబో' అటవీ ప్రాంతంలో మద్యం సీసాలను గుర్తించింది. మద్యంసీసాపై ఉన్న ఫింగర్ ప్రింట్, మద్యం ఎక్కడ కొన్నారు, తదితర వివరాలతో నిందితులను పట్టుకున్నారు. అప్పటి జిల్లా ఎస్పీ రాంబోను ప్రత్యేకంగా అభినందించారు.

■ 2021 ఫిబ్రవరి 5న బీర్‌పూర్ సమీపంలో జరిగిన హత్య కేసు దర్యాప్తులో 'రాంబో'నే కీలకంగా నిలిచింది. కల్లుమండువ వద్ద రాయితో మోదీ ఇద్దరు నిందితులు వ్యక్తిని హత్య చేశారు. ఈ కేసులో అనుమానం ఉన్న ఇద్దరు నిందితులను ముందుగానే అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. అయితే హత్య జరిగిన చోట వాసన పసిగట్టి పోలీస్‌స్టేషన్‌లో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నిందితుల వద్దకు వెళ్లి వారిని కరవబోగా భయానికి నేరాన్ని ఒప్పుకున్నారు. ఈ కేసులో నిందితులు ఇద్దరికి ఈ మధ్యనే శిక్ష కూడా పడింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

శ్రీనిధి

జగిత్యాల క్రీడావిభాగం: పట్టణంలోని జ్యోతి ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని శ్రీనిధి వచ్చే నెల 3 నుంచి మెదక్‌లో నిర్వహించనున్న 68వ ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

పెచ్చులూడుతున్న పెద్దాసుపత్రి

ప్రభుత్వ జిల్లా సాధారణ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో రోగుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబులోకి నీళ్లు చేరి ఇనుప చువ్వలు బయటకు తేలాయి. వరండా, గదులు, మొదటి అంతస్తు అత్యవసర విభాగం, పురుషుల వార్డుల్లో స్లాబులు పెచ్చులూడిపోయాయి. వాటి మధ్యే ఫ్యాన్లు తిరుగుతుండటంతో రోగులపై పడే ప్రమాదం లేకపోలేదు. గతంలో ఓ సారి మూత్రశాల స్లాబు పెచ్చులూడిపోగా ఓ రోగికి ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం భవనం పలుచోట్ల పెచ్చులూడినా మరమ్మతు చేపట్టకపోవడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే చొరవ చూపి మరమ్మతు చేపట్టాలని రోగులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, జగిత్యాల పట్టణం

మొదటి అంతస్తు అత్యవసర వార్డులో..

వార్డులో ప్రమాదకరంగా ఫ్యాను

శిథిలమైన స్లాబు

అక్రమాల గుట్టు తేలేనా!

చెక్‌డ్యాంల నిర్మాణ లోపాలపై విజిలెన్స్ దృష్టి

ఈనాడు, పెద్దపల్లి

రాష్ట్రంలో చెక్‌డ్యాం నిర్మాణాల ప్రగతి, వెచ్చించిన నిధులపై ఇటీవల హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. నిర్మాణాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ జరపాలని ఆదేశాలిచ్చారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా మానేరు, హుస్సేన్‌మియా వాగులపై నాలుగేళ్ల కిందట రూ.వందల కోట్లు వెచ్చించిన చేపట్టిన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పనులు జరుగుతుండగానే వచ్చిన వరదలకు చాలా చోట్ల నామరూపాల్లేకుండా కొట్టుకుపోయాయి. ఒక్కో చెక్‌డ్యాంకు రూ.50 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు వెచ్చించారు. నాణ్యత, పర్యవేక్షణ లోపాలు వెలుగు చూస్తున్నా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రెండు విడతల్లో 72 చెక్‌డ్యాంలు

2019-20లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 114 నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు. రెండు విడతల్లో 72 చెక్‌డ్యాంలు మంజూరు చేశారు. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలోని 52 ఆనకట్టలకు రూ.237.95 కోట్లు చెల్లించారు. జగిత్యాలలో రూ.20 కోట్ల అంచనాతో జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో అయిదు చెక్‌డ్యాం పనులు మాత్రమే ప్రారంభం కాగా అవి కూడా అసంపూర్తిగా ఉన్నాయి.

ప్రవాహానికి అడ్డుకట్ట వేసి భూగర్భ జలాలు పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.. నాసిరకం పనులతో ఆనకట్టలు తెగి నీళ్లతో పాటే నిధులూ కొట్టుకుపోతున్నాయి.. అనుభవం లేని గుత్తేదారులకు పనులు అప్పగిస్తున్న అధికారులు పర్యవేక్షణ బాధ్యతలు మరవడంతో కలకాలం ఉండాల్సిన నిర్మాణాలు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలనకు సిద్ధమవుతుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది..

ఎల్లడెలా నిర్మాణ లోపాలు

- ఆనకట్టల నిర్మాణంలో భాగంగా ముందుగా వాగులో గట్టిదనం వచ్చేవరకు ఇసుకను తోడి బెడ్ నిర్మించాలి. ఇందుకు భిన్నంగా ఇసుక పైనే నిర్మించడంతో ఆప్రాన్‌లు, రిటైనింగ్ వాల్స్, అబార్డ్‌మెంట్ భాగాలు వరద ఉద్ధృతికి దెబ్బతింటున్నాయి.
- వరద ప్రవాహాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక సాంకేతికత అందుబాటులో లేకపోగా ఇసుక మేటలు పూర్తిగా తొలగించకుండానే ఆనకట్టలు నిర్మించడంతో దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- నిర్మాణ అనుభవం లేని గుత్తేదారులకు ఒకటి కంటే ఎక్కువ నిర్మాణాలు కట్టబెట్టడంతో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది.

జమ్మికుంట మండలం విలాసాగర్ వద్ద కొట్టుకుపోయిన చెక్‌డ్యాం

అసలే ఆలస్యం.. ఆపై అర్ధంతరం

- సుల్తానాబాద్ మండలం గట్టెపల్లిలో రూ.4 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాం పనులు పునాది దశలోనే ఉన్నాయి. ఏడాది ఆలస్యంగా పనులు ప్రారంభించిన గుత్తేదారు సిమెంటు, కాంక్రీటు ధరలు పెరగడంతో మధ్యలోనే వదిలేశారు.
- 2016లో జమ్మికుంట మండలం విలాసాగర్ వద్ద మానేరులో రూ.10 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. 800 మీటర్ల పొడవున్న నిర్మాణంలో దాదాపు 120 మీటర్ల మేర కూలింది. మరమ్మతులకు రూ.4 కోట్ల వరకు అవుతాయని అంచనా వేశారు.
- వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి, ఓదెల మండలం కనగర్తి గ్రామాల మధ్య చెక్‌డ్యాం కట్టకు గండి పడింది. తాత్కాలికంగా మరమ్మతు చేసి లీకేజీలను అరికట్టారు. ఓదెల మండలం రూపనారాయణపేట, కనగర్తి చెక్‌డ్యాంలకు గతంలో వరదతో నష్టాలు సంభవించాయి.
- వేములవాడ మండలం మల్లారంలో మూలవాగుపై రూ.4.17 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. 80 శాతం పనులు పూర్తి కాగా గుత్తేదారుకు రూ.3.18 కోట్ల వరకు చెల్లించారు. ఇటీవలి వర్షాలకు కట్ట మీదుగా వరద పారడంతో సమీప ఇళ్లకు ముంపు ముప్పు పొంచి ఉందని డిటోనేటర్లతో పేల్చివేశారు.

ముంచిన వరదతో రూ.30 లక్షల నష్టం

మంథని మండలం అడవిసోమన్‌పల్లి వద్ద మానేరులో రూ.16 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం గతేడాది భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. రిటైనింగ్‌వాల్స్ దెబ్బతిని పరీవాహక పొలాలు నీట మునిగాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 23 ప్రధాన చెరువులతో పాటు మోరంచ, చలి, పెద్దవాగుల నుంచి భారీగా వరద చేరడంతో ఈ ఆనకట్ట దెబ్బతింది. దిగువ మానేరు జలాశయం గేట్లు ఎత్తి నీటిని వదలడంతో ఉద్ధృతి మరింత పెరిగింది. ఆనకట్టకు రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. 2023 జులై 27న వచ్చిన వరదకు చిన్నఓదాల వద్ద నిర్మించిన చెక్‌డ్యాం మధ్యలో గండి పడింది.

మంథని మండలం అడవిసోమన్‌పల్లి వద్ద ఇలా..

వరదకాలువకు నీటివిడుదల తగ్గింపు

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం సాయంత్రం వరకు 44,268 క్యూసెక్కుల వరద వస్తుండగా 10 స్పిల్‌వే గేట్లద్వారా 29,678, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,200 క్యూసెక్కులు గోదావరిలోకి వదులుతున్నారు.

జిల్లాలో పంచాయతీ ఓటర్లు 5.93 లక్షలు

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా సిద్ధమైంది. జిల్లాలోని 20 మండలాల్లో 382 గ్రామపంచాయతీలుండగా 3512 వార్డులున్నాయి. ప్రతి గ్రామంలో వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసి ప్రదర్శించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో 5,93,540 మంది ఓటర్లుండగా అందులో 2,83,010 మంది పురుషులు, 3,10,522 మంది స్త్రీలున్నారు.

ధర్మపురి పురవీధుల్లో బొడ్డెమ్మతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

వైభవంగా బొడ్డెమ్మ ఉత్సవాలు

ధర్మపురి: పట్టణంలో ఆదివారం రాత్రి బొడ్డెమ్మ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ రామానందేశ్వరస్వామి, శ్రీ చంద్రశేఖర స్వామివారి గద్దెలపై బొడ్డెమ్మను ప్రతిష్ఠించిన మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువతులు కోలాటాలు, నృత్యాలు చేస్తూ.. పుర వీధుల్లో బొడ్డెమ్మతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు.

పోలీసుల క్రికెట్ పోటీలు

జగిత్యాల, న్యూస్‌టుడే: పోలీసు పరేడ్ మైదానంలో ఆదివారం పోలీసు క్రికెట్ పోటీలు జరిగాయి. జగిత్యాల, మెట్‌పల్లి డివిజన్ మధ్య జరిగిన పోటీల్లో ఎస్సీ అశోక్‌కుమార్ సారథ్యం వహించిన మెట్‌పల్లి టీం మూడు పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జగిత్యాల డివిజన్ టీం 12 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎస్సీ అశోక్‌కుమార్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా వినోద్‌కుమార్, బెస్ట్ ఫీల్డర్‌గా సుమన్, బెస్ట్ బౌలర్‌గా రవికుమార్, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా సీఐ ఆరిఫ్ అలీఖాన్ నిలిచారు. జగిత్యాల, కోరుట్ల డీఎస్పీలు డి.రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రధనుస్సు

రాయికల్‌లో ఆదివారం సాయంత్రం ఒకవైపు వర్షం.. మరో వైపు ఎండ కాయడంతో ఇంద్రధనుస్సు ఏర్పడింది. పట్టణ వాసులు ఆసక్తిగా తిలకించారు. – న్యూస్‌టుడే, రాయికల్ పట్టణం

జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు

జగిత్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సొంతం చేసుకున్నారు. వరంగల్‌లో ఆదివారం కటాస్, స్పారింగ్ అంశాల పోటీల్లో పి.శ్రీజ బంగారు పతకం, ప్రవీణ్‌కుమార్ రజత పతకం, సంతోష్‌కుమార్, అరుణ్‌కుమార్ కాంస్య పతకం అందుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు రచ్చ శ్రీనుబాబు, పవన్ అభినందించారు.

పతకాలు సాధించిన విద్యార్థులు





(c) eenadu

రహదారి పనులు పూర్తి చేయిస్తా

డ్రైవింగ్ ట్రాక్‌పై ప్రత్యేక దృష్టి ■ కొత్త జిల్లాలకు ఆర్‌టీవో భవనాలు ■ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

నగరంలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల పనులను పూర్తి చేయించేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని కొత్త జిల్లా కేంద్రాలలో ఆర్‌టీవో కార్యాలయాలకు సొంత భవన నిర్మాణాలపై కార్యాచరణ జరుగుతుందన్నారు. బీసీ సంక్షేమశాఖ ద్వారా శాఖను మరింత పటిష్ఠం చేసి కార్యక్రమాలు విస్తరిస్తామని మంత్రి వివరించారు. పలు అంశాలపై 'న్యూస్‌టుడే' ముఖాముఖి..

? కరీంనగర్‌లోని కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్ మీదుగా భగత్‌నగర్, దోబీవాడ, గణేశ్‌నగర్, కలెక్టరేట్‌కు వెళ్లేందుకు కట్టరాంపూర్-కోతిరాంపూర్ రహదారి అనువుగా ఉంటుంది. ఈ రోడ్డు పనులు రెండు కిలోమీటర్లు మేర ఉండగా సగంలో వదిలేశారు. ఎప్పటిలోగా పూర్తి చేయిస్తారు

✓ ఈ రహదారికి సంబంధించిన వివరాలను తీసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడుతా. సమస్య నా దృష్టికి వచ్చింది. వీలైనంత త్వరగా పూర్తి చేయించేందుకు చర్యలు చేపడతా.

? ముఖ్యమంత్రి హామీ నిధులు, పట్టణ ప్రగతి కింద ప్రారంభించిన సమీకృత మార్కెట్ల పనులతోపాటు ఇతర నిర్మాణాలు నిలిచిపోయాయి. నిధుల కొరత తీవ్రంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఎప్పుడు మంజూరు చేయిస్తారు.

✓ దీనిపై కార్యాచరణ ఉంది. వర్షాల కారణంగా పనులు ఆగిపోయాయి. నిధులు విడుదల చేయించే పనిలో ఉన్నాను. అన్ని పనులు పూర్తి చేయించడమే కాకుండా నిలిచిన బిల్లులు కూడా మంజూరు చేయిస్తా.

? ఉమ్మడి జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంలో ఉన్న డ్రైవింగ్ పరీక్షకు సంబంధించి ట్రాక్ నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. పరీక్ష నిర్వహించడానికి ఇబ్బందులు పడుతున్నారు.

✓ ట్రాక్ పనులు మూడు నెలల్లో పూర్తి చేయిస్తా. త్వరలో అధునాతన విధానం అమల్లోకి తెస్తున్నాం. కరీంనగర్ రవాణా కార్యాలయాన్ని సందర్శించి సమీక్ష జరిపి సౌకర్యాలు కల్పిస్తాం.

? సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో రవాణా శాఖ కార్యాలయాలు అద్దె భవనంలో ఉన్నాయి. డ్రైవింగ్ పరీక్షల ట్రాక్‌లు లేవు. ఎప్పటిలోగా సౌకర్యాలు కల్పిస్తారు.

✓ కొత్త జిల్లాలో సొంత భవనాలు నిర్మించాలని రవాణాశాఖ నిర్ణయం తీసుకుంది. ఇటీవల శాఖాపరంగా నిర్వహించిన సమీక్షలో కూడా చర్చించాం.

? జిల్లా పరిధిలోని మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వైద్య విధాన పరిషత్ పరిధిలోకి మార్చాలని గత ప్రభుత్వం నిర్ణయించింది? ఇంకా అమలుకు నోచుకోవడం లేదు

✓ అన్ని నియోజకవర్గాల్లోని ప్రధాన పట్టణాల్లో వైద్యపరంగా సౌకర్యాలు కల్పించేలా ముందుకు వెళ్తాం. వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వాటిని తీసుకొచ్చి సేవలు విస్తరిస్తాం.

? బీసీ సంక్షేమశాఖ ద్వారా రుణాల మంజూరు నిలిచిపోయింది. నిరుద్యోగులు, చిన్న వ్యాపారులు ఉపాధి పనులు చేసుకోలేకపోతున్నారు. రాయితీ రుణాలు ఇచ్చే అవకాశముందా

✓ బలహీన వర్గాల సంక్షేమం కోసం కొత్త కార్పొరేషన్లు కూడా ఏర్పాటు చేశాం. రుణాల మంజూరు వంటి అంశాలను సమీక్షించి తగు నిర్ణయాలు తీసుకుంటాం.

దృష్టి సారిస్తున్నారా!

పిల్లల్లో పెరుగుతున్న కంటి సమస్యలు ■ ఆర్బీఎస్కే పరీక్షల్లో వెల్లడి

బుజ్జాయి అన్నం తిననని మారాం చేస్తే అమ్మకు గుర్తొచ్చే సాధనం ఫోన్.. అబ్బాయి అల్లరి చేస్తుంటే టీవీ పెట్టేస్తాడు నాన్న.. ఆ తర్వాత పిల్లలు బడి నుంచి రాగానే పుస్తకాలు పక్కన పడేసి ఫోన్లలో మునిగిపోతుంటారు.. హోంవర్క్ చేసుకోకుండా టీవీ చూస్తూ గడుపుతుంటారు.. పిల్లలను బుజ్జగించడానికి తల్లిదండ్రులు చేస్తున్న అలవాటు ముమ్ముందు వారికి ఇబ్బందులు తెచ్చిపెడుతోంది..

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

భావి పౌరుల్లో కంటి సమస్యలు పెరుగుతున్నట్లు రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ(ఆర్బీఎస్కే) నివేదికలు వెల్లడిస్తున్నాయి. పాఠశాలల విద్యార్థుల్లో దృష్టి లోపాన్ని గుర్తించిన ప్రభుత్వం కంటి పరీక్ష శిబిరాలు నిర్వహిస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసేలోగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు జరపాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో బడుల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థినీ పరీక్షించి కంటి సంబంధిత సమస్యలున్నాయా? దృష్టి లోపంతో బాధ పడుతున్నారా? శస్త్రచికిత్స అవసరం ఉందా? అని ఆప్తమాలజీ ఇన్‌స్ట్రక్టర్లు నిర్ధారిస్తున్నారు. అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 23 మంది భాగస్వాములున్నారు. మొత్తం 1,14,479 మంది విద్యార్థులకు గాను ఇప్పటివరకు 46,954 మందిని పరీక్షించారు. వీరిలో 2,527 మందికి అద్దాలు అవసరమని గుర్తించగా, 141 మందిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు.

ఉమ్మడి జిల్లాలో కంటి పరీక్షల వివరాలు

	విద్యార్థులు	పరీక్షించింది	దృష్టి లోపం	శస్త్రచికిత్స అవసరం
పెద్దపల్లి	26,780	11,591	563	44
జగిత్యాల	32,548	12,848	633	16
కరీంనగర్	31,541	10,753	593	26
సిరిసిల్ల	23,610	11,762	738	55

తల్లిదండ్రులు గమనిస్తుండాలి

■ ఎక్కువసేపు టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లను చూస్తే కళ్లు పొడిబారి దృష్టి సమస్య వస్తుంది.

■ పిల్లలు ఖాళీ సమయంలో టీవీలకు, ఫోన్లకు అతుక్కుపోకుండా ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహించాలి.

■ చదివే సమయంలో పుస్తకాలను దగ్గరగా పెట్టుకోకుండా కంటికి కనీసం 30 సెం.మీ.ల దూరంలో ఉండేలా చూడాలి.

మూడు, ఆరేళ్లలో పరీక్షలు

బాల్యంలోనే కంటి సమస్యలను గుర్తిస్తే భవిష్యత్తులో ఇబ్బందులుండవు. మూడేళ్ల వయసులో కంటి వైద్య పరీక్ష చేస్తే బొమ్మలను గుర్తు పడుతున్నారా? అనేది తేలుతుంది. తిరిగి ఆరేళ్ల వయసులో పరీక్షించాలి. దృష్టి లోపం ఉంటే అద్దాలు, ఇతర సంరక్షణ చర్యలు తీసుకోవాలి.



పెద్దపల్లిలో కంటి పరీక్ష చేస్తున్న నేత్ర సహాయకుడు

అక్షరాలు చిన్నగా కనిపిస్తున్నాయి

పుస్తకాలు, బోర్డుపై అక్షరాలు చిన్నగా కనిపిస్తున్నాయి. మా పాఠశాలలో కంటి పరీక్ష చేసుకున్నా. కొద్దిగా సమస్య ఉన్నట్లు తేలింది. అద్దాలు అవసరమని చెప్పారు.

– లలిత, 9వ తరగతి, పెద్దపల్లి జడ్పీ బాలుర పాఠశాల

ప్రతి విద్యార్థినీ పరీక్షిస్తున్నాం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. దృష్టి లోపాలను గుర్తిస్తూ, అద్దాల పంపిణీకి నివేదిస్తున్నాం. సమస్య అధికంగా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్స చేస్తాం.

– డా.కిరణ్, ఆర్బీఎస్కే, పెద్దపల్లి జిల్లా నోడల్ అధికారి

స్వీయ రక్షణే ప్రధానం

పిల్లలు ఎక్కువ సమయం సెల్‌ఫోన్, కంప్యూటరు, టీవీ చూస్తే చూపు మందగిస్తుంది. తదేకంగా చూస్తూ ఉంటే కళ్లలో తడి ఆరిపోతుంది. నిరంతరాయంగా మూడు గంటల కంటే ఎక్కువ సేపు చూడొద్దు. కళ్లకు సంబంధించి వ్యాయామం అలవాటు చేసుకుంటే కొంతవరకు సమస్య రాకుండా చూసుకోవచ్చు. ఏ విటమిన్ కలిగిన ఆకుకూరలు, క్యారట్, కోడిగుడ్డు తరచూ ఇస్తుండాలి.

– డా.వేణుమాధవ్, ఆప్తమాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, రామగుండం వైద్య కళాశాల

ఎందుకీ పరిస్థితి!

■ కరోనా సమయంలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడంతో పిల్లలు ఎక్కువ సమయం తెరలకు అంటుకుపోయి కంటి చూపుపై ప్రభావం పడింది.

■ ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఆన్‌లైన్ హోంవర్క్ ఇస్తుండటంతో ఫోన్ వాడకం పెరిగింది.

■ ఇటీవలి కాలంలో పిల్లలు ఎక్కువ సేపు టీవీలు, ఫోన్లకు అతుక్కుపోతున్నారు.

పెరుగుతున్న మానసిక సమస్యలు

విద్యార్థులు ఎక్కువ సమయం ఫోన్లు వాడుతుండటంతో దృష్టి లోపంతో పాటు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒత్తిడికి గురై ప్రతి చిన్న విషయానికీ చిరాకు పడుతున్నారు. ఆకలి మందగించడంతో పాటు ఏకాగ్రత, ఆలోచనా శక్తి కోల్పోతున్నారు. బరువు పెరగడంతో పాటు ఎదుగుదల క్షీణిస్తోంది. తల నొప్పితో బాధ పడుతున్నారు. అయిదేళ్లలోపు పిల్లలకు ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఇస్తుండటంతో కంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

అ ఆ ■ తరగతి గదుల్లో నల్లబల్లపై అక్షరాలు, పుస్తకాల్లో చిన్న అక్షరాలు కనిపించం లేదు.

■ పౌష్టికాహారం, జన్యు లోపాలతోనూ కొందరిలో కంటి చూపు సమస్య తలెత్తుతోంది.

కలగన్నారు.. ఖాకీ ధరించారు



న్యూస్‌టుడే, కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ)

పోలీస్ యూనిఫాం ధరించాలనేది వారి కల.. కష్టాలకు ఎదురీది దాన్ని నిజం చేసుకున్నారు. వంటింటికి పరిమితమయ్యే ఆడపిల్లలకు చదువెందుకు అనేది చాలా మంది భావన. కానీ పరిస్థితులు మారాయి. ఇంత చదివి కుటుంబ బాధ్యతలకే పరిమితం కావాలా అని ఆలోచించే అమ్మాయిలూ ఎక్కువవుతున్నారు. సమాజ బాధ్యతలో మేము భాగమే అని పోటీపడి ఉద్యోగాలు సాధిస్తున్నారు. సంకల్పం, పట్టుదల ఉండాలనే కానీ పేదరికం, ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాదని పెద్దపల్లి జిల్లా యువతులు నిరూపించారు. జిల్లాకు చెందిన పలువురు యువతులు ఎస్సై ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. 2022లో పోలీసు ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్ రాగా.. సాధించి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.

ట్యూషన్ చెబుతూ..

నా పేరు అమూల్య గైక్వాడ్. మాది పెద్దపల్లి జిల్లా గోదావరిఖని. తండ్రి బీందాస్, తల్లి రాజేశ్వరి. తండ్రికి కంటిచూపు లేకపోవడతో అమ్మపైనే కుటుంబ భారం పడింది. ఏరియా ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తూ.. నన్ను మా తమ్ముడిని చదివించింది. నేను చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివా. డిప్లొమా చేసి రంగారెడ్డి జిల్లాలో 2020లో బీటెక్ పూర్తి చేశా. కొవిడ్‌తో కొద్ది నెలలు ఇంటి వద్దే ఉన్నా. తర్వాత పోలీస్ నోటిఫికేషన్ రావడంతో హైదరాబాద్ వెళ్లి ప్రిలిమ్స్, ఈవెంట్స్, మెయిన్స్‌కు సన్నద్ధమయ్యా. ఆర్థిక పరిస్థితుల కారణంగా రూ.4వేలకు ట్యూషన్ చెప్పా. అమ్మ పంపించే నగదు.. ట్యూషన్ డబ్బులతో రెండేళ్లు అక్కడే ఉండి ఉద్యోగం సాధించా. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో రోజుకు 18 గంటలు శ్రమించా. మహిళాసాధికారత కోసం కృషి చేస్తా. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ రాణాలో ప్రొబిషనల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నా.

యూనిఫాంపై మక్కువతో..

నా పేరు సకపురం దివ్య. మాది పెద్దపల్లి జిల్లా గోదావరిఖని. తండ్రి శ్రీనివాస్ సింగరేణి కార్మికుడు. తల్లి రమాదేవి గృహిణి. నేను 2021లో ఎంటెక్ పూర్తిచేసి పోలీస్ ఉద్యోగానికి సన్నద్ధమయ్యా. ఇతర పోటీ పరీక్షలు కూడా రాయడంతో సింగరేణి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సైతం సాధించా. యూనిఫాం ఉద్యోగంపై ఉన్న మక్కువతో వెళ్లలేదు. ఇంటివద్దనే ఉంటూ సొంతంగా సన్నద్ధమయ్యా. నిత్యం మైదానానికి వెళ్లి రన్నింగ్, లాంగ్ జంప్ వంటివి సాధన చేశా. సమాజంలో మహిళలపై జరుగుతున్న వేధింపులను అరికట్టేందుకు కృషి చేసే అవకాశం వచ్చింది. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ ఠాణాలో ప్రొబిషనల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నా.

భర్త ప్రోత్సాహంతో..

నా పేరు ఎల్లూరి రవళిరెడ్డి. మాది పెద్దపల్లి జిల్లా గోదావరిఖని. తండ్రి లింగారెడ్డి చిరు వ్యాపారి. తల్లి వసంత గృహిణి. తండ్రి 2017లో చనిపోయాడు. మేము నలుగురం సోదరీమణులం. నాన్న చనిపోవడంతో అమ్మ మమ్మల్ని చదివించింది. నా బీటెక్ 2017లో పూర్తి కావడంతో శ్రీధర్‌రెడ్డితో పెళ్లి అయింది. నా భర్త హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం, నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాం. మూడేళ్లు ఉద్యోగం చేశా. తర్వాత పాప పుట్టడంతో ఇంటి వద్దనే ఉన్నా. 2022లో పోలీస్ నోటిఫికేషన్ రావడంతో.. నా భర్త ప్రోత్సహించారు. సొంతంగా పరీక్షలకు సిద్ధమయ్యాను. పాపను చూసుకుంటూ సన్నద్ధమవడం కష్టంగా మారడంతో అత్తమామలు బాధ్యత తీసుకున్నారు. మహిళల రక్షణకు నావంతు కృషి చేస్తా. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఠాణాలో ప్రొబిషనల్ సివిల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నా.

జానపద గాయకుడిపై అత్యాచారం కేసు

జగిత్యాల, న్యూస్‌టుడే: జానపద గాయకుడు, సాంస్కృతిక సారథి ఉద్యోగి సింగారపు మల్లేశం అలియాస్ మల్లిక్‌తేజపై జగిత్యాల పట్టణ పోలీసుస్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదైంది. జగిత్యాల గ్రామీణ మండలంలోని ఓ గ్రామానికి చెందిన సహచర గాయకురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై మన్మథరావు ఆదివారం తెలిపారు. అవకాశాల పేరుతో కరీంనగర్‌లోని స్టూడియోలో పలుమార్లు అత్యాచారం చేశాడని, పారితోషికం ఇవ్వలేదని, పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడని యువతి పేర్కొన్నట్లు పోలీసులు వివరించారు.

నేటి నుంచి ఓటరు నమోదు ప్రక్రియ

పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి సమరం

ఈనాడు, కరీంనగర్: మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఓటరు నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభం కానుంది. పై నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రస్తుతం 15 జిల్లాలున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఇప్పటికే కలెక్టర్లు నమోదుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో ఓటరుగా నమోదు చేసుకొనే అవకాశముంది. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, స్కూల్ అసిస్టెంట్, జేఎల్‌లు(జూనియర్ లెక్చరర్లు), డీఎల్‌లు(డిగ్రీ లెక్చరర్లు), యూడైస్‌లో నమోదైన ప్రైవేటు పాఠశాలల్లోని టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి అవకాశం ఉంటుంది.

డిసెంబరు 30న తుది జాబితా

ప్రస్తుతం ఈ స్థానం నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కె.రఘోత్తమ్‌రెడ్డి కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది మార్చి 29తో వీరి పదవీ కాలం ముగియనుంది. ఈ ఏడాది నవంబరు మొదటి వారం నాటికి కొత్త ఓటరు జాబితాను రూపొందించాలని ఎన్నికల సంఘం విధి విధానాలను జిల్లాలకు పంపించింది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. సవరణలు, ఆక్షేపణలకు గడువు ఇచ్చి డిసెంబరు 30న తుది ఓటరు జాబితా వెల్లడించనున్నారు.

కొత్తగా నమోదు చేసుకోవాల్సిందే



దాదాపు అయిదేళ్ల కిందట ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఓటు వేసిన వారంతా తిరిగి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. అప్పుడు ఓటేసినా.. వేయకున్నా ఇప్పుడు మళ్లీ కొత్త జాబితానే అధికారులు రూపొందిస్తారు. దీని ప్రకారమే త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తారు. 2019 మార్చిలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశముంది. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువ ఓటర్లున్నారు. జిల్లాల పరిధిలో పట్టభద్రులతో పాటు ఉపాధ్యాయు ఓటును నమోదు చేసుకోవాలి. ఫారమ్-18 ద్వారా వివరాలు నమోదు చేసి సీఈవో తెలంగాణ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి. పత్రాలను తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలి. 2021 నవంబరులోగా డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల స్థానానికి ఓటు నమోదు చేసుకోవచ్చు. మరోవైపు ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేసేవారు కూడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి నమోదుకు శ్రీకారం చుడుతున్నారు.

2019 జాబితా ప్రకారం..

విభాగం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఉపాధ్యాయ	15,892	7,322	-	23,214
పట్టభద్రులు	1,35,218	61,077	26	1,96,321

ఉప్పట్ల.. నీరందట్లే!

రెండేళ్ల కిందట వరదల్లో నీట మునిగిన ఎత్తిపోతల పథకం నేటికీ మరమ్మతుకు నోచుకోవడం లేదు. నిధుల మంజూరు.. ప్రతిపాదనలకే పరిమితం కావడంతో ఆయకట్టులో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఫలితంగా గోదావరి తలాపునే ఉన్నా ఆ రైతులకు కష్టాలు తప్పడం లేదు.

న్యూస్‌టుడే, మంథని

మంథని మండలం ఉప్పట్లలో గోదావరి తీరంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం 2022 జులైలో వచ్చిన వరదలకు నీట మునిగింది. నాలుగు పంపులు దెబ్బతినడంతో పాటు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మరు పాడయింది. మోటార్ల రాగి తీగలు, కండెన్సర్లు ఇతర సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లారు.

రూ.3.12 కోట్లతో ప్రతిపాదించాం

పథకం మరమ్మతుల కోసం రూ.3.12 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రాగి తీగ, ఇతర సామగ్రి చోరీకి గురి కావడంతో మళ్లీ అంచనాలు రూపొందించి ప్రతిపాదిస్తున్నాం. నిధులు మంజూరైతే యుద్ధప్రాతిపదికన పనులు చేపడతాం. పూడికతీత, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు, ప్రహరీ, ఎలక్ట్రానిక్, మెకానికల్ పంపుల మరమ్మతుకు ప్రతిపాదించాం. ఉప్పట్ల భూములకు కాలువ నీరందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– బలరామయ్య, నీటి పారుదల శాఖ ఈఈ

అయిదు గ్రామాల్లో 2 వేల ఎకరాలు

ఉప్పట్ల, గుంజపడుగు, పోతారం, విలోచవరం, నాగారం గ్రామాల్లోని 2 వేల ఎకరాలకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. ఉప్పట్ల, గుంజపుగు గ్రామాలకు మాత్రమే నీరందింది. లీకేజీలు, ఛాంబర్ల వ్యవస్థ సరిగ్గా లేక పోతారం, నాగారం, విలోచవరం ఆయకట్టుకు అందడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు అస్తవ్యస్తంగా జరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తండ్రిని హత్య చేసిన కొడుకు

ప్రాణం తీసిన ఆస్తి గొడవలు

పిన తల్లిపైనా దాడి

మల్లయ్య

వేములవాడ, న్యూస్‌టుడే: ఆస్తి తగాదాల విషయంలో కుమారుడు తండ్రిని హత్య చేసిన సంఘటన ఆదివారం వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన మామిండ్ల మల్లయ్య (65) మొదటి భార్య బాలవ్వకు కుమారుడు రాజు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. దాదాపు 12 ఏళ్ల క్రితం బాలవ్వ దొంగల చేతిలో హత్యకు గురైంది. తరవాత పద్మను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు బిడ్డలు ఉన్నారు. మల్లయ్యకు రూ.కోట్ల విలువ చేసే ఆస్తున్నాయి. గత కొంత కాలంగా ఆస్తులు పంచి ఇవ్వాలని మొదటి భార్య కుమారుడు రాజు తండ్రి మల్లయ్యను కోరుతున్నాడు. ఆదివారం ఈ క్రమంలో కుల సంఘం వద్ద పెద్దల సమక్షంలో ఆస్తుల విషయమై మాట్లాడుకున్నారు. అయితే అందరికీ వివాహాలు అయ్యేవరకు ఆస్తులు పంచేది లేదని మల్లయ్య చెప్పి ఇంటికి వెళ్లిపోయాడు. దీంతో పగ పెంచుకున్న కుమారుడు రాజు, మరో ఇద్దరు బంధువులు కలిసి అతని ఇంటికి వెళ్లి ముందుగా మల్లయ్య రెండో భార్య పద్మపై కత్తితో దాడి చేశారు. దీంతో ఆమె తలపై తీవ్ర గాయాలై కిందపడిపోగా అడ్డుకునేందుకు వచ్చిన మల్లయ్యపై కత్తితో దాడి చేశారు. దీంతో అతనికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా మల్లయ్య మృతి చెందాడు. పద్మను మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పట్టణ ఇన్‌ఛార్జి సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రమేశ్, మారుతి పరిశీలించి వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని తనిఖీ చేశారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలో పట్టుకుంటామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చెరువులో మునిగి యువకుడి మృతి

నరేందర్

చిగురుమామిడి, న్యూస్‌టుడే: స్నేహితులతో సరదాగా చెరువులోకి వెళ్లిన యువకుడు నీట మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చిన్న ముల్కనూర్‌లో విషాదం నింపింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అయిదుగురు స్నేహితులు స్థానిక చెరువు వద్దకు వెళ్లారు. తెప్ప మీద కూర్చొని చెరువులోకి వెళ్లారు. ఒక్కసారిగా తెప్ప బోల్తా పడటంతో ఈతరాని నరేందర్ (18) నీట మునిగాడు. పక్కనే ఉన్న ఓ జాలరు నరేందర్‌ను ఒడ్డుకు చేర్చి చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై రాజేశ్ పేర్కొన్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

SAREES

మావద్ద కంచి, ఆరణి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు చీరలు & బెనారస్, కలకత్తా, సూరత్ ప్యాన్సీ చీరలు హోల్‌సేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. 7396099834.

REAL ESTATE

FLAT FOR SALE

Flat No. 501, 2 BHK, Veera Residency, Near KES Garden, Laxminagar, Kaman, Karimnagar. Contact: M.Rajanikanth, Cell: 95500 02255.

HOUSE FOR SALE

KNR, **అల్గునూర్,** SR కాలేజ్ సమీపంలో పుల్లెల బాంకెట్ హాల్ మరియు గెస్ట్ హౌస్ & అల్గునూర్ చౌరస్తా సమీపంలో 450 గజాలలో G+1 విల్లింగ్ 6000 Sft అమ్మబడును. పుల్లెల మీనయ్య. సెల్: 78932 50325.

LAND FOR SALE

16 Guntas Land Highway Road RK Colony Karimnagar with House and Borewell. Contact. Cell: 9848043704, 7780646886.

PLOT FOR SALE

తిమ్మాపూర్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ - శ్రీ చైతన్య కాలేజీ ఎదురుగా రాజీవ్ హైవే పక్కన 2ప N/W ప్లాట్ అమ్మబడును. 223 చ.గ. హాస్టల్స్/ షట్టర్లకు అనుకూలం. 90301 37781.

వేములవాడ టౌన్‌లో విశ్వబ్రాహ్మణ వీధి నందు H.No. 5-3-128 (5-2-40) 4-58 చదరపు గజముల (3.79 గుంటల) స్థలము చిన్న గదితో సహా అమ్మబడును. ఆసక్తి గలవారు Cell: 99897 07699.

KNR, తీగల బ్రిడ్జి సమీపంలో, 3 అంతస్తుల బిల్డింగ్ ప్రక్కన, 5 గుంటలు లేదా 25 గుంటలు, 30' రోడ్ ప్లాట్ అమ్మబడును. పుల్లెల మీనయ్య. 78932 50325.

JOBS

Suitable B.Sc. Diploma Agriculture and B.Sc. Diploma Horticulture Graduates in Oil Palm Plantation Project in Peddapally District. Salary as per the industry standards for deserving candidates. Cont: 63601 92014.

త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు హృద్యులను/ షేషంబ్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. Cell: 91609 00024, 96404 00073.

లక్ష్మీ గార్మెంట్స్‌లో పనిచేయుటకు Male/Female వర్కర్స్ (పురుషులు / స్త్రీలు) Age 30 సం.లోపు కావలెను. సంప్ర: అశోక్‌నగర్, కరీంనగర్. సెల్: 85559 98915.

కన్సల్టెన్సీ కారు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వ

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే – జగిత్యాల ధరూర్‌క్యాంపు

? జగిత్యాల భవానీనగర్, ఆర్ఎన్‌టీనగర్, చొక్కారావు కట్టమిషన్ ప్రాంతాల కాలనీల్లోకి చెత్తను తీసుకెళ్లే వాహనాలు రోజుల తరబడి రాకా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. **- శ్రీకాంత్, సంతోష్, లక్ష్మీనారాయణ**

✓ వాహనాల మరమ్మతుతో కొంత జాప్యం జరగగా ఇక నుంచి అన్ని ప్రాంతాలకు క్రమంతప్పకుండా వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకుంటాము. **- సమ్మయ్య, పురపాలక కమిషనర్**

న్యూస్‌టుడే – మల్లాపూర్

? హుస్సేన్‌నగర్, ముత్యంపేట శివారులో రహదారిపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతు చేపట్టాలి. **- నూనే శ్రీకాంత్, ముత్యంపేట**

✓ త్వరలోనే మరమ్మతు చేపడతాం. **- వెంకటరమణ, ఆర్‌అండ్‌బీ డీఈ, మెట్‌పల్లి**

మురుగు కాలువలు శుభ్రం



కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణం కల్లూర్‌రోడ్‌లోని కాలనీలలో మురుగు కాలువలు సక్రమంగా తీయకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి, చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లడంతో 'ఈనాడు' 'మేమున్నాం.. మీకుతోడుగా' ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ స్పందించారు. పిచ్చిమొక్కలను తొలగించి మురుగు కాలువలను శుభ్రం చేయించారు. దీంతో దుర్గంధం తొలగిపోయింది.

పిచ్చిమొక్కలను తొలగిస్తున్న యువకులు

రైల్వేస్టేషన్ పరిసరాలు శుభ్రం

కోరుట్ల, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం కోరుట్ల మున్సిపల్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ఆవరణలో పరిసరాలు శుభ్రం చేశారు. సుమారు 30 మంది యువకులు స్టేషన్ పరిధిలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి చెత్తను ఏరివేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, పర్యావరణ ఏఈ మహేశ్, యువకులు పాల్గొన్నారు.

కరాటేలో బంగారు పతకాలు

ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న క్రీడాకారులు

కొడిమ్యాల, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పదకొండు మంది విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటి బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ బరిగె లక్ష్మిరాజం తెలిపారు. చెప్యాల గ్రామానికి చెందిన పులి ప్రణీత్, గుంటుకు రాహుల్, కొడిమ్యాలకు చెందిన కానవేని మేఘన, జడిగె వివేక్, బరిగె దీపిక, బరిగె దీక్షిత్, పిల్లి తనీష్, అబ్దుల్ ఖలీద్, మల్లిఖార్జున్, గంగాధర శ్రీనివాస్, బుద్దినేని రాజశేఖర్, పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

సురక్షిత నీటి సరఫరా లక్ష్యం

గ్రామ సహాయకులకు శిక్షణ

న్యూస్‌టుడే, సారంగాపూర్

మనిషికి నీరే ప్రాణాధారం.. అదే నీరు కలుషితమైతే ప్రాణంతకమవుతుందని.. ఇందుకు ప్రతి ఇంటికి సురక్షితమైన, నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి పంచాయతీలో 'గ్రామ మంచినీటి సహాయకుడి'ని నియమించి, 'నల్ జల్ మిత్ర' శిక్షణ కార్యక్రమాలను జిల్లా పంచాయతీరాజ్, మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా చేతిపంపులు, బోర్‌వెల్, సింగల్, త్రీ ఫేజ్‌ల మోటార్లు, ప్యానెల్ బోర్డు మరమ్మతు, పైపు లైన్ లీకేజీ అరికట్టడం, నల్లాలు బిగించడం, నీటి నాణ్యత తనిఖీ చేయడంపై శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు ఇప్పటికే ఉన్న వాటర్ మ్యాన్‌కు నైపుణ్యాన్ని పెంచాలని ప్రభుత్వం పరిగణించింది. ఇందులో భాగంగా నాలుగు రకాలుగా విభజించి ఒక్కో బ్యాచ్‌కు మండల స్థాయిలో శిక్షణ ఇస్తున్నారు.

జిల్లాలోని మండలాల్లో 24 నుంచి శిక్షణ ప్రారంభం కాగా ఆక్టోబరు 9న ముగియనుంది. మండల స్థాయిలో శిక్షణ తీసుకునే మంచినీటి సహాయకుడికి ఒక్కో విభాగంలో ప్రత్యేకంగా తర్ఫీదు ఇవ్వడంతో సత్వరమే సమస్యలు పరిష్కారం కావడంతో ముమ్ముందు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండనుంది. నీటి నాణ్యత ప్రమాణాలు ఏ విధంగా చూడాలనే దానిపై శిక్షణ ఇస్తున్నారు. ఆర్‌వో ప్లాంట్ నీటికి, మిషన్ భగీరథ ద్వారా నీటికి వ్యత్యాసం, కలిగే నష్టాలపై మంచినీటి సహాయకులకు శిక్షణ ఇస్తున్నారు. మంచినీటి పథకాలలో బ్లీచింగ్ కలిపే విధానం, మోతాదుపై శిక్షణలో వివరిస్తున్నారు. శిక్షణ ముగిసి తరువాత అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించనున్నారు. దీని ద్వారా పంచాయతీలలో నాణ్యమైన నీటి సరఫరా, చిన్న మరమ్మతుల కోసం సరఫరా నిలిచిపోకుండా ఉండడమే కాకుండా తాగునీటి సరఫరా మెరుగు పడి సంబంధిత సమస్యలను పరిష్కారానికి దోహదపడనుందని అధికారులు భావిస్తున్నారు.

తీరనున్న ఇబ్బందులు

ప్రజలకు నిరంతరం, నాణ్యమైన నీటిని అందించేందుకు శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడనుంది. చిన్న మరమ్మతులకు గ్రామాల్లో రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మంచినీటి సహాయకుల ద్వారా సమస్య పరిష్కారం కానుంది. అంతేకాకుండా గ్రామాల్లో ప్రతి నెల నీటి నాణ్యతను పరీక్షించడంతో నాణ్యమైన నీరు ప్రజలకు అందించే విధంగా సహాయకులు ఉపయోగ పడనున్నారు.

- రామారావు, డీఈఈ, నీటి సరఫరా విభాగం

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

రైతులతో మాట్లాడుతున్న ఐక్యవేదిక సభ్యులు

మేడిపల్లి, న్యూస్‌టుడే: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని రైతు ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. మేడిపల్లిలో ఆదివారం రైతులతో ఐక్యవేదిక సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రైతు రుణమాఫీ వర్తింప చేయాలని అక్టోబరు 4న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల రమేశ్ రెడ్డి, రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్యాల: అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని, ఎకరాకు రూ.15 వేల సాగుపెట్టుబడి సాయం అందజేయాలని, సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500ల చొప్పున బోనస్ అందజేయాలని జిల్లా రైతు ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం మల్యాల మండలం రామన్నపేట గ్రామంలో ఆదివారం రైతులతో మాట్లాడారు. పన్నాల తిరుపతిరెడ్డి, మల్లయ్య, మోహన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మల్లారెడ్డి, సాగర్‌రావు, తిరుపతి పాల్గొన్నారు.

కొడిమ్యాల: రైతు సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 4న చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున రైతులు హాజరై విజయవంతం చేయాలని రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా అధ్యక్షులు నల్ల రమేష్‌రెడ్డి, ఏలేటి నర్సింహారెడ్డి, రేకులపల్లి తిరుపతిరెడ్డి, డబ్బు గౌతంరెడ్డి, బి.నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

ఎమ్మెల్యే రాకేష్, జువ్వాడి నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడు లింబాద్రిని సన్మానిస్తున్న నాయకులు

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మినారాయణ అన్నారు. ఆదివారం మెట్‌పల్లిలో ఆర్యవైశ్య మహాసభ జగిత్యాల జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రితో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించవద్దని ఆర్యూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్ర వ్యక్తి అనుకుంటే వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఎన్టీరామారావు పేర్లను తొలగించాలన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగిరి వెంకటేశం, మహిళా విభాగం రాష్ట్ర కోశాధికారి కాసం సుష్మ, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, నిజామాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు పోలా సుధాకర్, శ్రీనివాస్, రాంబాబు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

భారీగా పెరిగిన గోదావరి నీటిమట్టం

ధర్మపురి: ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కారణంగా.. ధర్మపురి గోదావరి నీటిమట్టం ఆదివారం గణనీయంగా పెరిగింది. ఉదయం మంగళి ఘాట్ వరకు నీరు చేరింది.

రైతుల సహకారంతోనే సంఘాభివృద్ధి

బీర్‌పూర్: సభ్యుల సహకారంతోనే సంఘాభివృద్ధి జరుగుతుందని బీర్‌పూర్ సహకార సంఘ అధ్యక్షుడు ముప్పాల రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం సంఘ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మేనేజరు మండాటి సాగర్, మాసర్థి రమేష్, కొల్ముల రమణ, జితేందర్, రాజేశం, తదితరులున్నారు.

రాయపట్నం గోదావరిలో యువకుడి గల్లంతు

పవన్‌కుమార్

ధర్మపురి, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల దీక్ష స్వీకరించడానికి గోదావరిలో స్నానాలు చేసేందుకు వచ్చి ప్రవాహానికి కొట్టుకుపోయిన ఘటన రాయపట్నంలో జరిగింది. ధర్మపురి ఎస్సై మహేష్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లాలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ముగ్గురు యువకులు పవన్‌కుమార్(19) అశ్విన్(19), నవిత్‌వర్మ (22)లు కలిసి.. జగిత్యాల జిల్లా రాయపట్నం గోదావరిలో స్నానాలు చేయడానికి ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వచ్చారు. నదిలో దిగగా.. ప్రవాహం ఎక్కువ ఉండటంతో వారు కొట్టుకు పోయారు. అక్కడే ఉన్న జాలర్లు ఇద్దరిని కాపాడారు. గల్లంతైన పవన్‌కుమార్ జాడ కోసం జాలర్లు వెతుకుతున్నారు. దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

16 కిలోల గంజాయి పట్టివేత

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలపై గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను మణుగూరు సమీపంలో ఆదివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్సైజ్ శాఖ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా స్థానిక రథం గుట్ట అర్బన్ పార్కు సమీపంలో తనిఖీలు చేపట్టారు. మూడు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేశారు. వారి నుంచి రూ.4 లక్షల విలువైన 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో జగిత్యాలకు చెందిన అరవింద్, లక్ష్మణ్, సూర్యాపేటకు చెందిన గోపి, రమేష్, టేకులపల్లికి చెందిన సాయికుమార్, నవీన్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి చరవాణులతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు విచారణ చేపడుతున్నారు. కాలనీవాసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం మూడో వార్డులోని శివాజీనగర్‌లో ఒక మహిళ, ఇద్దరు వ్యక్తులు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథల కోసం విరాళాలు, నిత్యావసర వస్తువులు, పాత దుస్తులు ఇవ్వాలని వాహనంలో ఇంటింటికీ తిరుగుతున్నారు. వీరి వ్యవహార శైలిపై అనుమానం వచ్చిన కాలనీవాసులు పలు ప్రశ్నలు సంధించగా పొంతన లేని సమాధానాలు ఇచ్చి తాము హైదరాబాద్‌లోని ఓ అనాథాశ్రమంలో పని చేస్తున్నామని గుర్తింపుకార్డు చూపించారు. గుర్తింపుకార్డులో ఉన్న వివరాలతో ట్రస్ట్ నిర్వాహకులను చరవాణిలో సంప్రదించగా తాము ఎలాంటి విరాళాలు సేకరించడం లేదని, వచ్చిన వారితో తమకు సంబంధం లేదన్నారు. ఇంతలో ఇద్దరు వ్యక్తులు వాహనంతో సహా పారిపోగా మహిళలను పట్టుకొని స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై పోలీసులను వివరాలు కోరగా ముగ్గురు వ్యక్తులు మంచిర్యాలకు చెందిన వారని, వాహనంతోపాటు పారిపోయిన మరో ఇద్దరు అనుమానిత వ్యక్తులను పట్టుకొని విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు. మూడు నెలల కిందట పట్టణంలో భారీ చోరీ జరిగిన నేపథ్యంలో అపరిచిత వ్యక్తులు ఇంటింటికీ తిరుగుతూ విరాళాలు సేకరించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

క్రైం కార్నర్

తీవ్ర జ్వరంతో బాలిక మృతి

రాయికల్, న్యూస్‌టుడే: రాయికల్ మండలం ఆల్లీపూర్ గ్రామంలో తీవ్ర జ్వరంతో ఓ బాలిక మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలిక(12) ఏడో తరగతి చదువుతుండగా మూడు రోజుల కిందట జ్వరం రావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. జ్వరం తీవ్రం కావడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కొడిమ్యాల: కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన జితేందర్‌రెడ్డిపై మద్యం తాగి ద్విచక్రవాహనం నడిపినందుకు గాను కేసునమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు జితేందర్‌రెడ్డి మద్యం తాగి వాహనం నడపడంతో పాటు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ నందగిరి రాజును కాలర్ పట్టుకొని, దుర్భాషలాడుతూ ప్రభుత్వ విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నాడంటూ కానిస్టేబుల్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్ మండలం రేచపల్లిలో తాటికొండ నీరజపై పాత గొడవల కారణంగా ఈనెల 28న మల్యాల రాయమల్లు, గంగవ్వ, మల్లవ్వ, రాజవ్వ, సాంబ, మానస అనే వ్యక్తులు దూషించి దాడి చేయగా గాయాలు కావడంతో ఆమె భర్త తాటి జగన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తాళం వేసి ఉన్న ఇంటికి కన్నం

జగిత్యాల: జగిత్యాల వెంకటాద్రినగర్‌లో శనివారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. యజమాని ముసిపట్ల ఉదయ్‌కుమార్ ఇంటికి తాళం వేసి పెద్దపల్లికి వెళ్లగా ఆదివారం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.55 వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలు సైతం పగులగొట్టి తీసుకెళ్లారు. రూరల్ సీఐ క్రిష్ణారెడ్డి, పట్టణ ఎస్సై మన్మధరావు చోరీకి గురైన ఇంటిని పరిశీలించారు.

ఆలయంలో చోరీకి యత్నం

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మండలం కలిగోట గ్రామశివారులోని శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో చోరీకి యత్నించినట్లు గ్రామస్థులు ఆదివారం తెలిపారు. ఆలయ ఆవరణలోని హుండీని ఎత్తుకెళ్లి దేవాలయం వెనకాల పడేశారని చెప్పారు. శనివారం రాత్రి చోరీకి ప్రయత్నించినట్లు సీసీ కెమెరాలో కనిపించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మల్యాల: మల్యాల మండలం నూకపల్లి శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్యాలకు చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. బొట్ల వంశీ, ఖయ్యూమ్ అనే ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై జగిత్యాల నుంచి మల్యాలకు వస్తుండగా నూకపల్లి శివారులోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే అడ్డరోడ్డు సమీపంలో ప్రధాన రహదారిపై గుర్తు తెలియని కారు ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడగా వారిని 108లో జగిత్యాల ఆసుపత్రికి తరలించినట్లు అంబులెన్సు సిబ్బంది తెలిపారు.

సంఘాలు-కార్యవర్గాలు

జగిత్యాల, న్యూస్‌టుడే: దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొనుగూరి హన్మంతు, ప్రధాన కార్యదర్శిగా ఇరుగురాల భూమేశ్వర్, ఉపాధ్యక్షులుగా రాచర్ల సురేష్, రామిల్ల రాంబాబు, సంయుక్త కార్యదర్శులుగా మంతెన రాజు, గోడ రాజయ్య, కోశాధికారిగా బొల్లె లక్ష్మిరాజం, కార్యవర్గ సభ్యులుగా ఇరుగురాల శ్రీనివాస్, సుంకె ప్రకాష్, మంతెనస్వామి, గుండు నారాయణ, లింగంపల్లి లక్ష్మన్, ప్రత్యేక ఆహ్వానితులుగా కొండ రాజయ్య, శ్రీను ఎన్నికయ్యారు.

బీమారం: మేడిపల్లి, బీమారం మండలాల రైతు ఐక్య వేదిక కన్వీనర్లను ఆదివారం జిల్లా ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల రమేశ్ రెడ్డి ప్రకటించారు. బీమారం మండల అధ్యక్షుడిగా కమ్మరిపేటకు చెందిన ఉదిగిరి ఆదిరెడ్డి, మేడిపల్లి మండలశాఖ అధ్యక్షునిగా దమ్మన్నపేటకు చెందిన చిలివేరి తిరుపతి యాదవ్‌ను నియమించారు.రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి, తిరుపతి రెడ్డి, కరుణాకర్ తదితరులు అభినందించారు.

జగిత్యాల ధరూర్‌క్యాంపు: ఆలిండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా కొండ్ర జగన్, కార్యదర్శిగా ఇరుగురాల శ్రీనివాస్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.విజయభాస్కర్ ఆదివారం తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కులగణన చేపట్టి బీసీలకు రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని విజయభాస్కర్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు.

రాయికల్ పట్టణం: రాయికల్ పట్టణ గౌడ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎలుగందుల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా పొన్నం శ్రీకాంత్‌గౌడ్, కోశాధికారి బండి ప్రవీణ్ ఎన్నికయ్యారు. ఎన్నికల కమిటీ సభ్యులు మొగిలిపాక మహేష్, కైరం స్వామిచ పెద్దెర్ల నారాయణ, వల్లకొండ మహేష్, గుర్రం నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు

మెట్‌పల్లి పట్టణం: ఏబీవీపీ మెట్‌పల్లి నగరశాఖ నూతన కార్యవర్గాన్ని నియమించారు. నగర కార్యదర్శిగా మంగళపల్లి మారుతి, ఉపాధ్యక్షుడిగా సోలంకర్ కార్తీక్, సల్వాల లోకేష్, సాదుల పుతిన్, సంయుక్త కార్యదర్శి సాలవల వాసుదేవ, సోమ అఖుల్, వర్షిత్ ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా బండి అరుణ్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్‌గా జోగ సాయితేజ, ఖేల్ కన్వీనర్ బొప్పరాతి చరణ్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి జక్కుం చరణ్‌ను నియమించినట్లు విభాగ్ కన్వీనర్ అజయ్, మల్యాల రాకేష్, మాడవేణి సునిల్ తెలిపారు.

పెగడపల్లి: దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కేమలాటపల్లికి చెందిన ఇరుగురాల భూమేశ్వర్.. జిల్లా ఉపాధ్యక్షులుగా రాచర్ల సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ప్రకాశ్, శ్రీనివాస్ నియమితులయ్యారు.

ఆర్థికసాయం అందజేత

జగిత్యాల ధరూర్‌క్యాంపు: జగిత్యాల పురపాలక కార్మికుడు మారంపల్లి పోచయ్య రోడ్డు ప్రమాదంలో మరణించగా 9వ వార్డు జానకీరామ్ హౌజింగ్‌బోర్డు కాలనీ సభ్యులు రూ.33,600 నగదును బాధిత కుటుంబసభ్యులకు ఆదివారం అందించారు. కౌన్సిలర్ వొద్ది శ్రీలత, రామ్మోహన్‌రావు, నరసయ్య, సత్యంరావు, ప్రసాదరావు, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల వాణిజ్యం: కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన కొండ్ర ప్రహర్ష, కల్యాణ్ తల్లిదండ్రులు మృతిచెందగా జగిత్యాలకు చెందిన సామాజిక సేవకుడు సూరజ్ శివశంకర్ ఆదివారం మానకొండూరుకు వెళ్లి రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందించారు.

కరపత్రాల ఆవిష్కరణ

జగిత్యాల ధరూర్‌క్యాంపు: జగిత్యాలలో స్వర్ణకార సంఘం, దుర్గాభవాని సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించే దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, కూతురు రాజేశ్, నిర్వాహకులు కత్తోజ్ గిరి, కనపర్తి రవి, లక్ష్మణ్, గోపి, వేణు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మెట్‌పల్లి పట్టణం: ఆర్టీసీ సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవరాజ్ తెలిపారు. మెట్‌పల్లి డిపో పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రజలు సమస్యలు తెలపాలన్నారు. 99592 25927కి ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌కు డాక్టరేట్

మెట్‌పల్లి పట్టణం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మెట్‌పల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకయ్యకు అమెరికా కేంద్ర విశ్వవిద్యాలయం(యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ అమెరికా) ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్‌ను కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల తెలుగు విభాగ అధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ మెట్‌పల్లిలో వెంకయ్యకు అందించారు.

పాత దుస్తులు, పుస్తకాలు అందించండి

మెట్‌పల్లి పట్టణం: పాత దుస్తులతో పాటు పుస్తకాలుంటే వార్డులలో చెత్తసేకరణకు వచ్చే ఆటోకు అందించాలని కమిషనర్ మోహన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పాత బల్దియా భవన ఆవరణలో పలువురు పట్టణ ప్రజలు తీసుకువచ్చిన పాతదుస్తులను సేకరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కోటి క్షమాపణ యజ్ఞం

మెట్‌పల్లి పట్టణం: తిరుమలలో లడ్డూ కల్తీకి ప్రాయశ్చిత్తంగా మెట్‌పల్లిలోని ఖాదీ ఆంజనేయస్వామి ఆలయంలో గీత సత్సంగ్ నిర్వాహకుడు చిలమంతుల ఛత్రపతి ఆధ్వర్యంలో ఆదివారం కోటి క్షమాపణ యజ్ఞాన్ని నిర్వహించి శ్రీవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గాదె రమేష్, మహజన్ హరీష్, పడిగెల వెంకటేష్, బింగి రమేష్, కొండ గంగాధర్ పాల్గొన్నారు.

గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరం

కోరుట్ల : కోరుట్ల మండల పరిషత్ కార్యాలయంలో కోరుట్ల, కథలాపూర్ మండలాలకు చెందిన గ్రామ మంచి నీటి సహాయకుల శిక్షణ శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ప్రజలకు మంచినీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. కోరుట్ల, కథలాపూర్ ఎంపీడీవోలు రామకృష్ణ, శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వివ్‌ను కలిసిన ఇప్పపెల్లి గ్రామస్థులు

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామస్థులు ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను వేములవాడలో కలిసి సమస్యలను విన్నవించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించినట్లు తెలిపారు.

కనిపించని ప్రమాదం..

కాల